క్లుప్తంగా

మాలకొండ శనివారం ఆదాయం రూ.12,44,608

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసిన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆదాయం శనివారం రూ.12,44,608 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.28,480, తలనీలాలు రూ.69,950, ప్రత్యేక దర్శనం రూ.4,66,500, లడ్డుప్రసాదాలు రూ.2,08,555 అన్నదానం రూ.3,59,463, రూమ్‌అద్దెలు రూ.36,410 ఇలా వివిధ విరాళాలు కలిపి రూ.12,44,608 వచ్చినట్లు ఆయన తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రమణమ్మ అన్నారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శనివారం మస్టర్ పాయింట్ వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కందుకూరు మున్సిపాలిటీలో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటికీ కార్మికుల సంఖ్య పెంచలేదని దీని వల్ల పని భారం పెరుగుతోందన్నారు. రోజు రోజుకు పట్టణ విస్తీర్ణం, జనాభా పెరుగుతున్నా కార్మికుల సంఖ్య మాత్రం పెరగడం లేదన్నారు. అలాగే చెత్త సేకరించే బండ్లు మరమ్మతులకు గురవడంతో చెత్త సేకరించే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పులి నాగేశ్వరరావు, ఈశ్వరమ్మ, మహేష్, పోతురాజు, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


విద్యుత్ స్తంభాన్ని తాకిన ఆర్టీసీ బస్

కందుకూరు రూరల్: హైదరాబాద్ నుంచి కందుకూరు వస్తున్న ఆర్టీసీ బస్‌కు మండల పరిధిలోని ఓగూరు సమీపంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. సింగరాయకొండ నుంచి సీటీఆర్ఐ వరకు రోడ్డు నిర్మిస్తున్నారు. ఎదురు బండ్లు రావడంతో బస్సు రోడ్డు మార్జిన్ దిగింది. తిరిగి రోడ్డు ఎక్కించేందుకు రివర్స్ వెళ్లే ప్రయత్నంలో టైర్లు స్లిప్‌లై వెనుక ఉన్న విద్యుత్ స్తంభాన్ని తాకింది. దీంతో డ్రైవర్ గమనించి బస్ నిలిపివేసి ప్రయాణికులను దించారు. అనంతరం జేసీబీతో బస్‌ను బయటకు లాగారు. విద్యుత్ స్తంభాన్ని గట్టిగా తగిలి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. దీనిని చూసిన ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు


చెరువులో తవ్వకాలు జరుపుతున్న జేసీబీ

కందుకూరు రూరల్: మండలంలోని కొండికందుకూరు గ్రామంలోని చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామ సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య తెలిపారు. చెరువులో జేసీబీ పెట్టి పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తవ్వి తరలిస్తున్నారని సర్పంచ్ ఇరిగేషన్ శాఖాధికారులకు సమాచారం ఇచ్చినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్ని సార్లు ఫోన్లు చేసినా స్పందించడం లేదన్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాయకులకు అండగా నిలుస్తున్నారన్నారు. మట్టి తరలింపును నియంత్రించాలని అధికారులను కోరారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్న జేసీబీ, ట్రాక్టర్లను, అక్రమదారులపై కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.358


వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో గరిష్ట ధర రూ.358 పలికిందని వేలం నిర్వహణాధికారి ఏ. శ్రీనివాసరావు తెలిపారు. దావగూడూరు, చింతలపాలెం క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లోని రైతులు 976 బేళ్లను వేలానికి తీసుకురాగా అందులో 849 బేళ్లను కొనుగోలు చేయగా, వ్యాపారులు వివిధ కారణాలతో 127 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.295.91 పలికింది. వేలంలో 17 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358 పలికిందని వేలం నిర్వహణాధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లోని రైతులు 956 బేళ్ల వేలానికి తీసుకు రాగా అందులో 872 బేళ్ల కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 84 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ 318.53 నమోదైంది. వేలంలో 16 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి టీడీపీ దుశ్చర్యే

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్
- దాడిని నిరసిస్తూ కనిగిరిలో రాస్తారోకో, కొవ్వొత్తులతో నిరసన


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్, పక్కన వైఎం ప్రసాద్‌రెడ్డి, కస్తూరిరెడ్డి, గఫార్

కనిగిరి రూరల్:

విజయవాడ నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక మహా శిల్పంపై జరిగిన దాడి ముమ్మాటికీ టీడీపీ ప్రభుత్వ దుశ్చర్యేనని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక పామూరు బస్టాండ్ చర్చి సెంటర్‌లో శనివారం రాస్తారోకో, కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించి ఒక చారిత్రాత్మక ఘట్టానికి ఆద్యుడిగా నిలిచారని కొనియడారు. నగర నడిబొడ్డులో అంబేడ్కర్ విగ్రహం ఉండకూడదనే దురుద్దేశంతోనే ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిందన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడితో టీడీపీ కుట్ర, చంద్రబాబు అసలు నైజం మరోసారి బయట పడిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ శ్రేణులు విగ్రహాల కూల్చివేతకు పాల్పడుతున్నారని ఘాటుగా విమర్శించారు. అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్ రాజు, వైఎస్సార్ సీపీ దళితనేత కటికల వెంకటరత్నం మాట్లాడుతూ చంద్రబాబు చేసిన దుర్మార్గపు వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక మహాశిల్పంపై జరిగిన దాడి దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందన్నారు. దుండగులు ఎంతటి వారైనా పట్టుకొని తక్షణం శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో దాడులను, హత్య రాజకీయాలను, విగ్రహాల ధ్వంసాన్ని ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. చంద్రబాబు దుర్మార్గపు పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ), జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, మేకల శ్రీనివాసుల యాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు జి.బొర్రారెడ్డి, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు దేవరాజ్, దాసరి మురళీ, చింతం శ్రీను, ఆదినారాయణరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, మూలే రాజశేఖరరెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్, నాగూర్‌బీ, నాగమణి, షకీలా, సుస్మిత, భారతి, బాబు, శిగా కృష్ణారావు, శ్రీను పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా


సమావేశంలో మాట్లాడుతున్న దద్దాల నారాయణ

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల

పామూరు: పార్టీలోని కార్యకర్తలందరికీ అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. పామూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో వివాహ వేడుకలు, మండలంలోని తిరగలదిన్నెలో వైఎస్సార్ సీపీ సర్పంచ్ పిన్నిక వెంకట రమణమ్మ, పిన్నిక రత్తయ్య నూతన గృహప్రవేశంలో పాల్గొని అనంతరం పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లోని నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి దద్దాల మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి విధ్వంసాలు, ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలను చంపడం, దౌర్జన్యాలు, ఇసుకదోపిడీ వంటి చర్యలు తప్ప రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. మండలంలో ఇప్పటికే రేషన్ డీలర్లను, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను, కుకింగ్ ఏజెన్సీ వారిని తొలగిస్తున్నారని, మరికొందరిని తొలగించే దిశగా పావులు కదుపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. కూటమి నేతలు ఇలాంటి చౌకబారు విధానాలు విడనాడాలన్నారు. అధికార పార్టీ వారు తమను ఎన్ని ఇక్కట్లు పెట్టినా, కేసులు పెట్టినా జంకమని వచ్చే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, వెలిగండ్ల జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, కనిగిరి మడతల కస్తూరిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ చెనికల శ్రీను, సర్పంచ్ పిన్నిక రమణయమ్మ, పిన్నిక రత్తయ్య, ఎం గోవర్ధన రాధాకృష్ణ, ఎస్టీ సెల్ శ్రీరాం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ నాయకులు కటికాల వెంకటరత్నం, సైకం ఏడుకొండలు, రేగులగడ్డ నాగరాజు, షేక్.కాలేషా, నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సత్కారం


ఎంపీడీఓకు వీడ్కోలు పలుకుతున్న కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది

కందుకూరు రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.ప్రమీలరాణి శనివారం బదిలీపై వెళ్తున్న సందర్భంగా కార్యాలయ సిబ్బంది వీడ్కోలు పలికారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శ్రీకాళహస్తి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ బదిలీపై కందుకూరుకు వచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరిగి శ్రీకాళహస్తికి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

విద్యుదాఘాతానికి తీవ్ర గాయాలు


విద్యుత్ షాక్‌తో గాయపడిన

కొండపి (సింగరాయకొండ): విద్యుదాఘాతానికి వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పేరిదేపి గ్రామానికి చెందిన పి.వీరకుమార్ ఆచారి (38) అనే వ్యక్తి విద్యుత్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో మిట్టపాలెంలో విద్యుత్ స్తంభానికి ఉన్న కరెంట్ తీగ తెగిపోవడంతో ఆచారిని పిలిపించుకొని మరమ్మతులు చేస్తున్న సమయంలో షాక్‌కు గురై కింద పడ్డాడు. చేతులకు మంటలు రావడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఘనంగా యూటీఎఫ్ 50 వసంతాల వేడుక


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కనిగిరి రూరల్: యూటీఎఫ్ యాభై ఏళ్ల వసంతాల వేడుకలను శనివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకులు వి.మాలకొండారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి పి.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే ఖాజా రంతుల్లా, రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఎం బ్రహ్మారెడ్డి, కృష్ణమూర్తి, ఎస్కే ఖాజాహుస్సేన్, పాతులూరయ్య, కేవీ వెంకటేశ్వర్లు, ఆరు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం పలు సేవాహిత కార్యక్రమాలు, ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

లింగసముద్రం: యూటీఎఫ్ 50 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకుడు కూరపాటి రమేష్ యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు టి.సరోజినీ, టి.సుధాకరరావు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ కృష్ణమోహన్

కందుకూరు రూరల్: మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. సైడ్ కాలువల నిర్వహణ మరమ్మతులపై నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. చెత్త నుంచి సంపద వచ్చేలా చేస్తే అది పంచాయతీలకే ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమీలరాణి, సర్పంచ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా కదిరి బాబూరావు జన్మదిన వేడుకలు


కేక్ కోస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు): వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు జన్మదిన వేడుకలు శనివారం శీలంవారిపల్లెలోని కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.ఖాదర్‌బీ బుజ్జి బెంగళూరులోని ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఖాసీంపీరా, కె.అంకయ్యయాదవ్, షేక్.మహబూబ్‌బాషా, అబ్దుల్, షాజిద్, నజీర్, జలీల్, మున్నీ పలువురు పాల్గొన్నారు.

నేడు ఏపీటీఎఫ్ జోనల్ సమావేశం

కనిగిరి రూరల్: ఏపీటీఎఫ్ కనిగిరి జోనల్ సమావేశం ఈ నెల 11న ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పి.రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎస్ నాయబ్ రసూల్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలపై, వర్క్ అడ్జస్ట్మెంట్ గురించి చర్చిస్తామన్నారు. యూనియన్‌లోని ఆరు మండలాల అధ్యక్ష, కార్యదర్శులంతా తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

కొండపి (సింగరాయకొండ): కొండపిలోని స్థానిక గుడిపల్లి చందు కల్యాణ మండపంలో ఈనెల 13వ తేదీ జరిగే విద్యుత్ వినియోగదారుల అదాలత్, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ వీరయ్య తెలిపారు. కందుకూరు డివిజన్ పరిధిలోని కొండపి, జరుగుమల్లి, సింగరాయకొండ, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, కందుకూరు, పొన్నలూరు మండలాలకు చెందిన వారు హాజరై సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. అదాలత్‌లో రిటైర్డు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, చైర్మన్ సీజీఆర్ఎఫ్ ఇమ్మానియేలు, జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ కేవీ సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు.

కాలువల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు


పూడికతీత పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలో మురికి నీటి కాలువల పరిశుభ్రతలో నిర్లక్ష్యం వహించ వద్దని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న డ్రైనేజీ కాలువ పూడికతీత పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఇళ్లల్లో నుంచి, దుకాణాల్లో నుంచి వచ్చే చెత్త, చెదారాన్ని డ్రైనేజీల్లో వేయకుండా ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. కాలువల్లో చెత్త చెదారం వేస్తే మురుగునీరు పారుదల జరగకుండా దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి రోగాలు ప్రబలుతాయని తెలిపారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగాభవాని ఆలయ వార్షిక వేడుకలు


హెచ్ఎంపాడులో గంగమ్మ తల్లికి పొంగళ్లు సమర్పిస్తున్న భక్తులు

హనుమంతునిపాడు: స్థానిక గంగాభవానీ ఆలయ వార్షిక వేడుకలను భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గంగాభవానీ మూల విగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అర్చకులు మహాలక్ష్మి, గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్య

కొండపి (సింగరాయకొండ): దళితుల ఆశాజ్యోతి అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసి హేయమైన చర్య అని దళిత సంఘాల నాయకులు బి.నాగభూషణం అన్నారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమై అరెస్టు చేసి శిక్షించాలన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న బుర్రా

బుర్రాను కలిసిన పలువురు నాయకులు

కందుకూరు: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను స్థానిక కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులను బుర్రా దృష్టికి తెచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అనేక మంది చిరుద్యోగులను తొలగిస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన బుర్రా అధికార పార్టీ నేతల ఆగడాలను చట్ట ప్రకారం ఎదుర్కొందామని, ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానంటూ భరోసానిచ్చారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు.

లారీని ఢీ కొట్టిన కారు


గాయపడిన కారు నడుపుతున్న వ్యక్తి


ప్రమాదానికి గురయిన కారు

- ఒకరికి తీవ్రగాయాలు

ఉలవపాడు: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి కారు ఢీ కొనడంతో కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. జాతీయ రహదారిపై మండల పరిధిలోని చాగల్లు–రాజుపాలెం మధ్య ఈ సంఘటన శనివారం జరిగింది. వివరాలు.. ఒంగోలుకు చెందిన శివ కావలి నుంచి ఒంగోలుకు తన సొంత కారులో వెళుతున్నాడు. చాగల్లు దాటిన తరువాత ముందు వెళుతున్న లారీని వెనుక భాగంలో ఢీ కొట్టాడు. దీంతో బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుని 108 సిబ్బంది సిబ్బంది కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కారులో ఒక్కడే ఉన్నాడు. క్షతగాత్రుడు స్పృహలో లేకపోవడంతో వివరాలు తెలియరాలేదు. కేవలం తనది ఒంగోలు అని మాత్రమే చెప్పినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీరారెడ్డి, కాలేషా భౌతికకాయాలకు నివాళి


వీరారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల


కాలేషా భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పట్టణంలోని కొత్తూరుకు చెందిన కన్నేటి వీరారెడ్డి భౌతికకాయాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే దేవాంగనగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్కే మాలపాటి కాలేషా అనారోగ్యంతో మృతి చెందాడు. కాలేషా భౌతికకాయాన్ని దద్దాల సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, చంటి, కృష్ణారెడ్డి, రమణా, ఖాశింసా, ముకరంజీ బాషా, మౌలాలి, అలగోజి మస్తాన్, ఎం కాలేషా, పీర్ హుస్సేన్, ఇస్మాయిల్, గౌస్‌పీరా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి (సింగరాయకొండ): వర్షాలు, ఈదురుగాలులకు విద్యుత్ లైన్లు, స్తంభాలు కిందపడిపోయి మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కోటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి


రోగులను పరీక్షిస్తున్న ఆరోగ్య శాఖాధికారి మాధవీలత

కొండపి (సింగరాయకొండ): ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.మాధవీలత అన్నారు. మండలంలోని నెన్నూరుపాడులో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. తొలుత రికార్డులు పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఐ ప్రియాంక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవపాడులో భారీ వర్షం


ఉలవపాడులో భారీ వర్షం

ఉలవపాడు: మండల పరిధిలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల వరకు ఎండ, ఉక్కపోతగా ఉంది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు ప్రారంభం అయ్యాయి. తర్వాత భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటల పాటు వర్షం పడింది. ఈ వర్షంతో మామిడి, సపోట తోటలకు మేలు జరుగుతుందని రైతులు తెలిపారు. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం ఊరట నిచ్చింది.